

మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిది

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని ప్రధాన రహదారి మధ్య డివైడర్‌పై ఉన్న మొక్కలను సంరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు అన్నారు. గురువారం మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న మొక్కల సుందరీకరణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మొక్కల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, డివైడర్‌పై వాణిజ్య సముదాయాల వ్యర్థాలను కొందరు వ్యాపారస్తులు వేస్తున్నారని, దీనివల్ల మొక్కలు పాడైపోతున్నాయని అన్నారు. అటువంటి వారిని గుర్తించి అపరాధ రుసంతో పాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ వెంట ప్రజారోగ్య అధికారి సిహెచ్.మురళి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పేరుకే 24గంటల ఆస్పత్రి

ఒక్క పూట విధులకే పరిమితమవుతున్న వైద్యులు

గ్రామాల్లో పేదలకు సరైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ విధులకు సకాలంలో హాజరు కావాల్సిన కొంతమంది వైద్యులు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిస్తున్నారు. ఇందుకు నిదర్శనం కొమరాడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మధ్యాహ్నం ఒంటి గంటకే ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీలు దర్శనమిస్తున్నాయి.

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. కొమరాడ మండల కేంద్రంలో గల పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండడం లేదని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన వైద్యులు బదిలీపై వెళ్లడంతో ఇద్దరు వైద్యులను ప్రభుత్వం ఈ పిహెచ్‌సికి నియమించింది. ఈ ఇద్దరు వైద్యుల్లో ఒక మహిళ, ఒక పురుష వైద్యులను నియమించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ కొన్ని గంటలకు మాత్రమే వైద్యులు పరిమితం అవుతున్నారు. ఈ ఇద్దరు వైద్యుల్లో కేవలం ఒకరు మాత్రమే విధులకు వస్తున్నారని, మరికొరు వివిధ కారణాల పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. స్థానిక పిహెచ్‌సిలో పనిచేస్తున్న మహిళ వైద్యులు ప్రతిరోజు ఒంటిగంటకే ఇంటికి వెళ్లిపోయి మధ్యాహ్నం నుంచి విధులకు హాజరు కావడం లేదని రోగులు చెబుతున్నారు. మరో వైద్యుడు ఉన్నప్పటికీ బయట వైద్య శిబిరాలకు, వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు వెళ్లడంతో పిహెచ్‌సిలో అరొకరగా వైద్యసేవలం దుతున్నాయని రోగులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని నెలలుగా బిపి మిషన్ పనిచేయకపోయినా వైద్యాధికారులు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. కొన్ని సమయాల్లో పూర్తిగా ఆసుపత్రిలో వైద్య సేవలందే పరిస్థితి లేదన్నారు. గత్యంతరం లేక ఆసుపత్రికి వచ్చే రోగులు ఆసమయంలో విధుల్లో ఉన్న సిబ్బందికి చూపించుకొని అవసరమైన మందులు తీసుకెళ్తున్నామని చెబుతున్నారు. మండల కేంద్రంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరిగినా ప్రజలు ప్రభుత్వాసుపత్రికి తరలి వెళ్తుంటారు. ఆ సమయంలో ప్రజల ఆరోగ్య స్థితిగతులను చూసేవారు లేకపోవడంతో దిగు స్థాయి సిబ్బంది తనిఖీలు చేసి చిన్నవాటికైతే మందులు ఇచ్చి పంపిస్తారు. వారి సాధ్యం కాకపోతే పార్వతీపురం రిఫర్ చేస్తున్నారు.

ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండరు. పిహెచ్‌సికి వెళ్తున్న రోగులకు కనీస వైద్య సేవలు కూడా అందని పరిస్థితి. కనీసం ఆసుపత్రిలో బిపి తనిఖీ చేసే మిషన్ కూడా పనిచేయడం లేదంటే వైద్య సేవలు ఏ విధంగా ఉన్నాయో అర్థమవుతుంది. కనీస వైద్య సేవలందించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి విధులకు హాజరు కాని వైద్యులపై చర్యలు తీసుకోవాలి.

శిష్టు కృష్ణమూర్తి,
కొమరాడ.

మధ్యాహ్నం 1గంటకే ఖాళీగా ఉన్న వైద్యాధికారి ఛాంబర్

విధులకు డుమ్మా కొడుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలి

ప్రజలకు నిత్యం వైద్య సేవలందించాలని ఆసుపత్రిలో వైద్యులను ప్రభుత్వం నియమించినప్పటికీ ఆ విధంగా వైద్య సేవలు అందడం లేదు. ఎప్పుడు ఆస్పత్రికి వెళ్లినా కేవలం వైద్య సిబ్బంది మాత్రమే తనిఖీలు చేసి మందులు ఇచ్చి పంపిస్తున్నారు. గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు పెట్టినప్పటికీ ఫోటోలకు తప్ప ప్రజలకు మాత్రం వైద్య సేవలందడం లేదు. తక్షణమే ఉన్నతాధికారులు పర్యవేక్షించి ప్రజలకు సరైన వైద్య సేవలు అందించాలి.

పి.శ్రీనునాయుడు,
కోటిపాం

ప్రభుత్వ నిబంధన ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాల్సి ఉంది. కానీ సమావేశాలు, శిక్షణా తరగతులు, ఇలా పేర్లు చెప్పి వైద్యులు విధులకు గైహాజరవుతున్నారని మండల ప్రజల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. మరో వైపు ఉన్నత అధికారులు ఆసుపత్రికి వచ్చి తనిఖీ చేసిన సందర్భంలో విధులకు హాజరుకాకపోతే ప్రజాప్రతినిధులతో సిఫార్సులు చేయించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా అధికారుల పర్యటన మండలంలో విస్తతంగా జరుగుతుంది. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో మండలం ఉన్నప్పటికీ వైద్య అధికారులు తీరుపై ప్రజలు ముక్కు మీద వేలేసుకొనే పరిస్థితి ఉంది. మిగిలిన పిహెచ్‌సి పరిస్థితి కూడా ఇలాగే ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేసి ఆసుపత్రిలో వైద్యులు విధులకు సకాలంలో హాజరై ప్రజలకు వైద్య సేవలందించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జిఒ 1పై సర్వత్రా నిరసనలు

- ఆందోళన చేసిన టిడిపి నాయకులు అరెస్ట్
- ప్రభుత్వ చర్యలనువ్యతిరేకించాలంటూ వామపక్షాలు పోస్టర్ విడుదల

రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులపై నిర్బంధాలను విధిస్తూ జారీ చేసిన జిఒ 1పై జిల్లాలో పలుచోట్ల ప్రతిపక్షాలు నిరసనలు తెలిపాయి. తక్షణమే ఈ జీవోను రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ వామపక్షాలు, ప్రజాసంఘాలు నిరసన పోస్టర్‌ను విడుదల చేశాయి. అలాగే టిడిపి ఆధ్వర్యాన పార్వతీపురంలో నిరసన తెలిపిన నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. గుమ్మలక్ష్మీపురం, పాలకొండ, సాలూరు తదితర చోట్ల టిడిపి నాయకులు నిరసనలు తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

టిడిపి నేతల అరెస్టు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

చిత్తూరు జిల్లా కుప్పంలో టిడిపి నాయకులపై లాఠీచార్జ్, చంద్రబాబును అడ్డవేత, జివో 1 అమలుపై టిడిపి నేతలు ద్వారపురెడ్డి జగదీష్, బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకొని, వారిని అరెస్టు చేసి గరుగుబిల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రతిచర్యపై తీవ్ర వ్యతిరేకత వస్తుందని, ఈ ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకత, వైఫల్యాలను అడ్డుకునేందుకు, ప్రజాస్వామ్యాన్ని గొంతునొక్కే చీకటి జీవోలను తీసుకువస్తున్నారని విమర్శించారు. దీనివల్ల ప్రజలకు ముఖ్యమంత్రి పట్ల ఏహ్యభావంతో పాటు మరికొద్దిరోజుల్లో తిరుగుబాటు చేసే పరిస్థితి ఉందని అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగన్‌కు గట్టి గుణపాఠం ప్రజలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ టిడిపి అధ్యక్షులు, దొగ్గ మోహనరావు, జి.రవికుమార్, ఎంపిసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాస రావు, ఉదయభాను, జాగాన రవికుమార్, కౌన్సిలర్లు బడే గౌరినాయుడు, కె.మధు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 1ను వెంటనే రద్దు చేయాలని కురుపాం నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తగూడలో టిడిపి శ్రేణులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న పౌర హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛను హరించడానికి తీసుకొచ్చిన జీవో వల్ల ప్రజలు, ప్రతిపక్షాలు గొంతు నొక్కడమేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినప్పుడు టిడిపి ప్రభుత్వం ఇలాగే అడ్డుకుంటే పరిస్థితి ఏవిధంగా ఉండేదో అర్థం చేసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డికి ఓటమి తప్పదన్నారు.



గరుగుబిల్లి పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

కలెక్టరేట్ : రాష్ట్రంలో రోడ్‌షోలు, ర్యాలీలు, నిరసనలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 1ను తక్షణమే ఉపసంహరించాలని కోరుతూ, ప్రభుత్వ నిర్బంధాన్ని, ర్యాలీ నిషేధించే జీవోను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు గురువారం స్థానిక సుందరయ్య భవన్లో పోస్టర్ విడుదల చేశారు. ప్రజలంతా ప్రభుత్వ నిర్బంధ జీవోను ఖండించాలని కోరారు. పౌర ప్రజాతంత్ర హక్కులకు నష్టం చేసే చర్యలను ప్రజలంతా ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మధరావు, ఎపి రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎం.భాస్కరరావు, సిపిఎంఎల్ లిబరేషన్ నాయకులు కర్రి శ్రీనివాసరావు కోరారు. రాష్ట్రంలో ర్యాలీలు, నిరసనలు చేయొద్దనే జీవో 1ను వ్యతిరేకించండి, ప్రజాస్వామ్య హక్కయిన ర్యాలీలు, సభలను నిషేధించడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం జీవో ఉప సంహరించినచో రౌండ్ టేబుల్ సమావేశాలు, సభలు, నిరసన ర్యాలీలు, దశల వారీ ఆందోళన, పోరాట కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు బంటు దాసు, జనార్ధన, పువ్వల ప్రసాదు, జీవరత్నం, బి.అప్పలనాయుడు, కూర్మారావు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాజు, పండు, కృష్ణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : బహిరంగ సభలు, ర్యాలీలను నిషేధిస్తూ వైసిపి ప్రభుత్వం ఇచ్చినటువంటి జీవో 1 వెంటనే వెనక్కి తీసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడుకు వస్తున్న జనాధారణ చూసి ఓర్వలేక వైసిపి ప్రభుత్వం అర్ధరాత్రి పూట జీవోను విడుదల చేసి ర్యాలీలు, సభలు, సమావేశాలు ఆపివేయడానికి చూడడం నియంత పాలనని రానున్న ఎన్నికల్లో కచ్చితంగా ప్రజలు ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కిమిడి రామరాజు, టెక్కలి దుర్గారావు, బోటు గౌరీ, ఆరిక సాయి, సామల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, అక్రమాలను, దొల్లతనాన్ని కప్పి పుచ్చుకోవడానికే జిఒ-1 అమలు చేశారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆరోపించారు. గురువారం ఏలాం జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదురుగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి మాట్లాడుతూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా జిఒ అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు కార్యక్రమానికి అనుమతి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. వైసిపి ప్రభుత్వం పతనానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, గంటా సంతోష్, వెన్నపు శ్రీనివాస రావు, అంపోలు శ్రీను, పడాల రాంబాబు, అడపా బాబ్జీ, జవరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: కుప్పం నియోజకవర్గంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సభను రాష్ట్ర ప్రభుత్వాన్ని అడ్డుకోవడానికి నిరసనగా గురువారం టిడిపి నాయకులు కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం జంక్షన్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు సభలకు ఆదరణ చూసి ఓర్వలేక వైసిపి ప్రభుత్వం చీకటి జీవోలను తీసుకొచ్చిందని చెప్పారు. కుప్పంలో టిడిపి సభను అడ్డుకోవడం ద్వారా వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి సమాధి కట్టినట్లయిందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్ దేవ్, టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మక్కువ మండలం కన్వీనర్ జి.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

9న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక డిబేనియన్ స్కూల్ మైదానంలో ఈ నెల 9న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ను ఎల్‌విఆర్ అధినేత పెదబోగిలి మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ కె.అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 6 నుంచి ఆర్మీ సంప్రదించాలని తెలిపారు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు 94 91699068, 8500009004 9 ను సంప్రదించాలని తెలిపారు. గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి రూ. 10వేలు, రెండో బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతి వాలీబాల్ కిట్టు ఇవ్వబడతాయని తెలిపారు.

వైసిపిని కాదంటే పేదల సంక్షేమం గల్లంతే : రాజన్నదొర

ప్రజాశక్తి- సాలూరు

రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడిస్తే రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన పింఛను వారోత్సవాలలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 24రకాల ఫించన్‌లను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఎపి మాత్రమేనని చెప్పారు. ప్రతి నెలా 62లక్షల మందికి రూ.1800కోట్లు పింఛన్ల రూపంలో అందిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ పనులు చేయలేని వారికి నెలకి రూ.5 వేల నుంచి 10వేల వరకు పింఛను మొత్తాన్ని అందజేస్తున్నామని చెప్పారు. అధిక ఆదాయం వున్న తెలంగాణలో కూడా పింఛను మొత్తం ఎపి కంటె తక్కువేనని చెప్పారు. పేదల పిల్లలు ఉన్నత విద్య అభ్యసించాలనే లక్ష్యంతో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం తమదేనని చెప్పారు. పట్టణానికి సంబంధించి గుమడాం లేఅవుట్-5లో ఇళ్ళు లబ్దిదారులు త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. మార్చి నెలాఖరులోగా పునాదులు నిర్మించకపోతే కేంద్ర ప్రభుత్వ నిధులు వెనక్కి పోతాయని చెప్పారు. పింఛన్ల తొలగింపుపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి అర్హులైన పేదలందరికీ పింఛన్లు అందుతాయని చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి పేదలందరికీ ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని కాదనుకుంటే పేదలే నష్టపోతారని చెప్పారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ గందరగోళంలో వుందన్నారు. ఇరుకు రోడ్లపై సభలు, సమావేశాలు వద్దని ప్రభుత్వం చెపుతుంటే టిడిపి నాయకులు రాద్ధాంతం చేయడం దారుణమని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపినే గెలిపించాలని రాజన్నదొర కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైసిపి ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు, కౌన్సిలర్‌లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, లింగాల దుర్గా, వైసిపి నాయకులు హరి, బాలాజీ పి.అప్పలస్వామి, కె.వెంకటరమణ, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ హెచ్ శంకరరావు పాల్గొన్నారు.



పింఛను పత్రాన్ని లబ్ధిదారుకు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొ

పామాయిల్ కోత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పామాయిల్ కార్మికసంఘం రాష్ట్ర నాయకులు సత్యనారాయణ

ప్రజాశక్తి - సాలూరు రూరల్

పామాయిల్ కోత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని పామాయిల్ కార్మికసంఘం రాష్ట్ర నాయకులు టి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని మామిడిపల్లిలో పామాయిల్ కార్మిక సంఘం జిల్లా సదస్సు గురువారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అతికష్టంమైన పని పామాయిల్ కార్మికులు చేస్తున్నారని, అనేక సందర్భాల్లో ప్రమాదాల బారినపడి వికలాంగులైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం పామాయిల్ రైతు సంక్షేమ బోర్డు వలే పామాయిల్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా వీరికి మాత్రం రోజు కూలి పెంచడంలేదన్నారు. ఈ కార్మికులకు ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి, పనిముట్లు ఇవ్వాలని కోరారు. అలాగే ప్రమాదం సమయంలో కార్మికులను వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ పామాయిల్ కోత కార్మికుల సమస్య పరిష్కారానికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు అనంతరం నూతన జిల్లా కన్వీంగ్ కమిటీ ఏర్పాటైంది. గౌరవ అధ్యక్షులుగా కొల్లి గంగునాయుడు, జిల్లా కన్వీనర్‌గా మర్రి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా పెదకాపు చిన్న, తాడంగి సంబురు, ప్రేమ్ కూమర్, బిరుసు, కోర్రా పండు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జన్ని ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ భేష్ : ఆర్‌జెడి

ప్రజాశక్తి - పాచిపెంట

అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ సంతృప్తికరంగా ఉందని ఐసిడిఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి అభిప్రాయ పడ్డారు. మండలంలోని పింద్రంగివలస అంగన్వాడి కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. కేంద్రం ఆవరణలో పూల మొక్కలు, కాయకూరల పెంపకం చూసి అంగన్వాడి కేంద్రం నిర్వహణ ఎంతో సంతృప్తికరంగా ఉందని కార్యకర్తకు అవార్డు ఇవ్వాలంటూ కొనియాడారు. అనంతరం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నాడు నేడు పనులు కింద 17 కొత్త అంగన్వాడీ భవనాలు మంజూరయ్యవన్నారు. అలాగే భవనాల ఆధునీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ఖాళీ అయిన ఉద్యోగాల భర్తీ, పదోన్నతులు వెంటవెంటనే జరుగుతున్నాయని తెలిపారు. కొత్తగా వస్తున్న యాప్‌లపై సూపర్వైజర్లు, కార్యకర్తలు అప్డేట్ కావాలని సూచించారు. పౌష్టికాహారం సక్రమంగా అంగన్వాడీ కేంద్రాలకు అందేలా చూడాలని సిడిపిఒను ఆదేశించారు. కార్యక్రమంలో సిడిపిఒ బి.అనంతలక్ష్మి, ఎసిడిపిఒ ఎస్తేర్ రాణి పాల్గొన్నారు.

గర్భిణుల వసతిగృహాన్ని సందర్శించిన ఆర్‌డిడి

సాలూరు : పట్టణంలోని గుమడాం వైటిసిలో వున్న గిరిజన గర్భిణుల వసతిగృహాన్ని గురువారం సాయంత్రం ఐసిడిఎస్ ఆర్‌డిడి ఆర్.చిన్మయిదేవి పరిశీలించారు. వైటిసిలో వున్న మౌలిక సదుపాయాల గురించి ఆమె ఆరా తీశారు. గర్భిణులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిర్వహణ తీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట అర్బన్ ఐసిడిఎస్ సిడిపిఒ సత్యవతి, రూరల్ సిడిపిఒ సుగుణ, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు వున్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి పలు సూచనలు ఇస్తున్న ఆర్‌జెడి చిన్మయిదేవి

జాతీయ స్థాయి వర్క్‌షాప్‌కు జెడ్‌పి చైర్మన్

విజయనగరం: మండల, జిల్లా స్థాయి అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఢిల్లీలో గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కార్యశాలకు జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో ఈ రెండు రోజుల వర్క్ షాప్ జరుగుతోంది. మండలాలు, జిల్లాల అభివృద్ధికి ప్రాజెక్టు ఆధారిత అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన అనే అంశంపై రెండు రోజులపాటు వివిధ రంగాల నిపుణులు పాల్గొని పలు అంశాలపై చర్చిస్తారు. మన రాష్ట్రం తరపున జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సహా పలువురు జిల్లాపరిషత్ చైర్మన్‌లు ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయమంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్, కార్యదర్శి సునీల్ కుమార్, సంయుక్త కార్యదర్శి అలోక్ ప్రేమ్ నాగర్ తదితరులు ప్రారంభోపన్యాసం చేశాం మండల, జెడ్‌పి అభివృద్ధికి నిధుల విడుదల తదితర అంశాలపై శ్రీనివాసరావు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్‌ను కలసి చర్చించారు.

మావోయిస్టుల కదలకపై అప్రమత్తం

ప్రజాశక్తి - మక్కువ

ఎఒబి ప్రాంతానికి ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో మావోయిస్టులు కదలికపై అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి సుభాష్ సిఆర్‌పిఎఫ్ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం మావోయిస్టు ప్రాబల్యం గల 5 జిల్లాల జాబితాలో పార్వతీపురం మన్యం జిల్లా ఉండడంతో స్థానిక సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ బృందానికి డిఎస్‌పి తగు సూచనలు చేశారు. సివిల్ పోలీసుల సహాయ సహకారాలు కూడా తీసుకుని ముందుకెళ్లాలన్నారు. మన్యం జిల్లాను మావోయిస్టు లక్ష్యం చేసుకోడానికి గల కారణాలను కూడా ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఆంధ్రా - ఒడిశా రాష్ట్రాల మధ్య కుటియా గ్రామాల తగవులతో ఉందని, అలాగే అధిక శాతం గిరిజనులే ఉండడం మావోయిస్టులు తమకు అనుకూలంగా మలచుకొనే ఆస్కారాలు ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ఉప ముఖ్యమంత్రి కూడా ఈ జిల్లాలోనే ఉండడం, వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు

తెలుగు నేర్చుకుంటే మేలు..

సిఆర్‌పిఎఫ్ సిబ్బంది తెలుగు భాష నేర్చుకోవడం వల్ల ఎంతో ఉపయోగం ఉందని డిఎస్‌పి వారికి సూచించారు. స్థానిక ప్రజానీకంతో మమేకమయ్యేందుకు ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. సిఆర్‌పిఎఫ్ డ్రెస్ కోడ్‌కు ఎంతో గౌరవం ఉందన్నారు. కార్యక్రమంలో సాలూరు సిఐ ధనుంజయరావు, స్థానిక ఎస్‌ఐ పైడిరాజు, సిఆర్పిఎఫ్ కమాండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై డిఎస్‌పి ఆకస్మిక సందర్శన

సిఆర్‌పిఎఫ్ సిబ్బందితో మాట్లాడుతున్న డిఎస్‌పి సుభాష్

శంబర పోలమాంబ జాతర ఏర్పాట్లను పార్వతీపురం డిఎస్‌పి సుభాష్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన చదురుపూడి, వనం గుడి పరిసరాలను పరిశీలించారు. చదురుగుడి వద్ద క్యూలైన్లు ఏర్పాట్లు, తదితర అంశాలపై ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, సభ్యులతో కలిసి చర్చించారు. శాంతి, భద్రతలకు సంబంధించిన అంశాలను సిఐ ధనుంజయరావు, ఎస్సై పైడిరాజుకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జాతర కార్యక్రమాలకు ఏ విధమైన ఆటంకాలు లేకుండా ఇప్పటికే 28 మందిపై బైండోవర్ కేసులు పెట్టామని వారు డిఎస్‌పికి తెలిపారు. ఈనెల 10న జరగనున్న సమీక్ష సమావేశంలో లోతుగా చర్చిద్దామన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సిబ్బంది మురళీకృష్ణ, ఉప సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు

పాఠశాల సందర్శన

సీతంపేట : మండలంలోని దేవనాపురం ప్రాథమిక పాఠశాలను ఎంపిడిఒ కె. గీతాంజలి గురువారం సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. నాడు నేడు పనులు ప్రోగ్రెస్‌ను పరిశీలించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ పౌష్టికాహారం ఎలా అందిస్తున్నారన్న దానిపై పరిశీలించారు.

నేలను తాకుతున్న సచివాలయ కేబుల్

నేలను తాకుతున్న సచివాలయం కేబుల వైరు

మక్కువ : ప్రభుత్వం సచివాలయాలకు ఇంటర్నెట్ సౌకర్యాల కోసం ఉపయోగించిన కేబుల్ వైర్లు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో భూమికి తాకుతూ దర్శనమిస్తున్నాయి. మండ లంలోని తూరుమామిడి–గోపాలపురం మధ్య కేబుల్ వైర్లు నేలకు తాకుతూ ఏ క్షణం తెగుతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. అలాగే రహదారి మధ్యలో కూడా వేలాడుతుండడంతో వాహనాలకు తగిలి వైర్లు తెగిపోయే ఆస్కారం ఉంది. వెంటనే అధికారులు స్పందించి తీగెలను సరిచేయాలని కోరుతున్నారు. లేకుంటే ఇంటర్నెట్ సేవలకు ఇబ్బంది కలుగుతుందని ఆందోళన చెందుతున్నారు

చిన్న భోగిలిలో పారిశుధ్య పనులు

సీతానగరం : మండలంలోని చిన్నభోగిలిలో పారిశుధ్య పనులను గ్రామ సర్పంచి కురుమాన రాధా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామంలో అన్ని వీధులు, కాలువల్లో మురుగునీరు నిల్వ చెత్తలను తొలగిస్తున్నారు. రోడ్డు ఇరువైపులా శుభ్రం చేయించారు. తాగునీరు బోర్లు వద్ద మురుగనీటిని తొలగించి ఉన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.మనోహర్, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

కొమరాడ : బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దంటూ శుక్రవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఎపి గిరిజన సంఘం నాయకులు రామారావు, రామస్వామి, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ధర్నా జయప్రదం కోరుతూ గురువారం మండలంలోని అంటివలసలో ప్రచారం చేశారు. ధర్నాకు గిరిజనులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

లక్షణరావు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

కురుపాం : వైసిపి జిల్లా అధికారి ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు సోదరుడు లక్షణరావు ఆయన స్వగ్రామమైన గొల్లవలసలో ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి గురువారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలా కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డు వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

సాలూరు : మున్సిపాలిటీలోని పది సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 19వార్డు వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ హెచ్ శంకరరావు చెప్పారు. ఈ నెల 3నుంచి 8వరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏయే వార్డు వాలంటీర్ పోస్టులు ఏ కేటగిరీకి రిజర్వు చేయబడిందన్న వివరాలను ఆన్‌లైన్‌లో చూసుకుని దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు.

వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శంకరరావు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సాలూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం పట్టణంలోని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కమిషనర్ శంకరరావుని కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు ఆధ్వర్యాన కార్మికులు కమిషనర్ శంకరరావుని కలిసి సమస్యలను వివరించారు. మూడు నెలల హెల్త్ అలవెన్సు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనిఫారం, కుట్టు ఛార్జీలు మూడేళ్ల మొత్తం మంజూరు చేయాలని కోరారు. సరెండర్ లీవు మొత్తాన్ని మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సహాయ కార్యదర్శి టి.శంకరరావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అటవీశాఖాధికారి అవతారం

అటవీ హక్కుల చట్టాలపై అవగాహన

కురుపాం : మండలంలో ఊసకొండ పంచాయతీ పనసభద్రలో గురువారం అటవీ శాఖ అధికారి బి.అవతారం గిరిజన రైతులకు అటవీ హక్కులు, అడవుల్లో ఉన్న మొక్కలు, వాటి పెంపకం, అడవిలో నిప్పు పెట్టడం వల్ల జరిగిన అనార్థాలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా గిరిజన రైతులనుద్దేశించి అయాను మాట్లాడు తూ రైతులు అడవులకు వెళ్లినప్పుడు చెట్లు నరకడం సంబంధించి గోడలి, కత్తి లాంటి ఆయుధాలు తీసుకు వెళ్లకూడదని, అడవులకు నిప్పు పెట్టడా నికి అగ్గి లాంటి వస్తువులు తీసుకు వెళ్లినట్లయితే ఆంధ్రప్రదేశ్ అటవీ హక్కుల చట్టం 1962, 1967 ప్రకారం వారిపై అటవీ వన్యప్రాణ చట్టం కింద శిక్ష అర్హులని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ అడవులను రక్షించడానికి తప్ప పాడు చేయకూ డదని సూచించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది ఎం.రమేష్, ఎ.కడాయి, ఎస్.నాగేశ్వరరావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

విద్య మరింత బలోపేతం చేయాలి

వంగర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మరింత బలోపేతం చేయాలని బొబ్బిలి ఉప విద్యాశాఖ అధికారి తిరుపతి నాయుడు అన్నారు. మండలంలోని మరువాడ, కోనంగిపాడు పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 5వ తరగతి విద్యార్థులతో చదివించి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన జరిగిన నేపథ్యంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పరీక్షా కేంద్రాల ఎక్కడ పెడితే బాగుంటుందనేమ విషయంపై చర్చించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు అందించారు. ప్రధాన ఉపాధ్యాయుల జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సన్యాసిరాజు, ఎంఇఒ దుర్గారావు, ప్రధానోపాధ్యాయులు కొప్పర శ్రీనివాసరావు, బి. ఎరకయ్య పాల్గొన్నారు.

ఇప్పటి వరకూ 20శాతం ధాన్యం కొనుగోలేనా?

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి డి. వెంకటరమణ నాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే వి. కళావతి, ఎమ్మెల్సీ పి. విక్రాంత్‌లు హాజరయ్యారు. వ్యవసాయ శాఖ పద్దులకు సంబంధించి వ్యవసాయ అధికారి కె.మన్మధరావు మాట్లాడుతుండగా ఎమ్మెల్యే కళావతి చొరవ తీసుకొని మండలంలో ఎంత శాతం ధాన్యం కొనుగోలు చేశారని ప్రశ్నించగా 20శాతం వరకు ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరణ ఇచ్చారు. ధాన్యం విక్రయాలు జరపటంలో రైతులు ముందుకు రావటం లేదా? ఎందుకు ఇంత తక్కువ శాతం ధాన్యం కొనుగోలు చేశారని ఆమె ప్రశ్నించారు. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాలతో ధాన్యం కొనుగోలు చేసినట్లు ఎఒ వివరణ ఇచ్చారు. వెంటనే ఆమె జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. వీరఘట్టం మండలంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిఎంను కోరారు. అనంతరం పలు శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి, ఉమా మహేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు పి. విజయకుమారి, వి. భరత్, ఎంపిడిఒ ప్రభాకర్ రావు, సర్పంచులు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిని పశ్నించిన ఎమ్మెల్యే

వీరఘట్టం: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల పెంపు

పాలకొండ: ఇచ్చిన మాటకు ప్రకారం పింఛన్లను ప్రభుత్వం పెంచిందని ఎమ్మెల్యే కళావతి అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో మాటిచ్చిన ముఖ్యమంత్రి పింఛను పెంచి మాటకు కట్టుబడి ఉన్నట్టు నిరూపించుకున్నారన్నారు. ఇదొక్కటే కాకుండా మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతిఒక్క హామీనీ నెరవేర్చుతున్నార న్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్లు పల్లా ప్రతాప్, రౌతు హనుమంతురావు, ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపిలు కనపాక సూర్యప్రకాష్, అనీల్‌కుమార్, ఎంపిడిఒ డొంక త్రినాథులు, నగర పంచాయతీ కమిషనర్ సామంతి సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిలు పాల్గొన్నారు.

వీరఘట్టం : అర్హులకే పింఛను పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ విక్రాంతులు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పథకాలు అందజేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి. గౌరమ్మ, ఎంపిపి వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి, ఉమ మహేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గోవిందరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ లీలా ప్రసాదరావు, ఎంపిడిఒ ప్రభాకర్ రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు లలిత కుమారి, పిఎసిఎస్ డైరెక్టర్లు భోగిలత మాణిక్య చంద్రశేఖర్, రంబ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకం

ప్రజాశక్తి - కురుపాం

అర్హులైన ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని పి.లేవిడిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, అవి సక్రమంగా అందుతున్నాయా, లేద అని ఆరా తీశారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, జిల్లా కోప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి సీనియర్ నాయకులు, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, మాజీ సభ్యులు అంధవరపు కోటేశ్వరరావు, మాజీ ఎంపిపి ఆనిమ ఇంద్రకుమారి, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని గుచ్చిమి గ్రామ సచివాలయం పరిధిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రభుత్వం 36 రకాల ప్రభుత్వ పథకాల అందిస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, సర్పంచ్ ఎం.శ్రీదేవి, ఎంపిడిఒ బి.కృష్ణ మహేశ్ రెడ్డి, ఎంపిటిసి సభ్యులు చల్లాపు జగదీశ్వరరావు, వైసిపి నాయకులు బి.చిట్టిరాజు, ఎం.ధనుంజయ నాయుడు, ఎ.కృష్ణంనాయుడు, ఆర్ వి పార్థసారథి, వివిధ శాఖ అధికారులు, సర్పంచులు, వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు

కురుపాం: పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

పాచిపెంట: మండలంలోని గురువు నాయుడుపేటలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పి. రాజన్న దొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ పథకాల అమలుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పథకాల అమల్లో ఏదైనా సమస్య ఉంటే తమకు తెలియజేస్తే సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరిస్తానని లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ, జి ముత్యాల నాయుడు, ధనుంజయ్, ఈ వీరమనాయుడు, జెడ్‌పి వైస్ చైర్మన్ సింహాచలం, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు అధికారులు పాల్గొన్నారు..

ముఖ హాజరు తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

మున్సిపల్ పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు అందరికీ ముఖహాజరు తప్పనిసరి అని మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్లో కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు ముఖ గుర్తింపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎపిఎఫ్‌ఆర్ఎస్ యాప్‌లో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, కింది స్థాయి సిబ్బంది ముఖ గుర్తింపు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఈ రిజిస్ట్రేషన్ వల్ల ప్రభుత్వ ఉద్యోగులకు అన్ని విధాలా మేలు జరుగుతుందని అన్నారు. అనంతరం కార్మికులు కమిషనర్‌తో మాట్లాడుతూ ప్రతి ఏటా జనవరి 7లోపు కార్మికులకు ఇవ్వాల్సిన బట్టలు, సబ్బులు, కొబ్బరినూనె ఇవ్వాలని, వీటితో పాటు సరెండర్ లీవ్‌లు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ సరెండర్ లీవ్‌లకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలుపుతూ, మీకు ఇవ్వాల్సిన బట్టలు, సబ్బులు, కొబ్బరి నూనెలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ద్వారా పంపిణీ చేస్తామన్నారు. మీమీ వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పనులను సక్రమంగా చేయాలని, మీ ఉద్యోగ బాధ్యతలను వేరొకరికి అప్పగించడం వల్ల ఆయా ప్రాంతాల్లో జరగాల్సిన పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా జరగడంలేదని, ఇకపై ఇలాంటి సమస్య తలెత్తకుండా చూసే బాధ్యత మీపైనే ఉందని అన్నారు.

వైసిపితోనే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కేవలం వైసిపి ప్రభుత్వానికే సాధ్యమని, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని పెదబొండపల్లిలో రూ.40లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించి, అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో అందరికీ ఆదర్శంగా నిలుస్తూ, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో దాదాపు 3వేలకు పైగా కొత్త పింఛన్‌లు మంజూరు కాగా, పార్వతీపురం మండలంలో 459 మందికి మంజూరైన పింఛన్లను అందిస్తున్నామన్నారు. మండలంలో దాదాపు 11వేలకు పైగా పింఛన్లు అందిస్తున్న ఘనత తమదన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జిశోభారాణి, ఎంపిడిఒ అకిబ్‌జావేద్, సర్పంచ్ సవరపు తౌడమ్మ, ఎఎంసి చైర్మన్ ఎం.భాగ్యలక్ష్మి, వైసిపి నాయకులు బలగ నాగేశ్వరరరావు, బొమ్మి రమేష్, భీమవరపు కృష్ణమూర్తి, గుంట్రెడ్డి దామోదర, చందాన శివాజి, సవరపు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలకు ఫైబర్ నెట్

ప్రజాశక్తి- సీతంపేట

మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ వెంకటరమణ

మండలంలో 36 సచివాలయాలకు ఫైబర్ నెట్ సదుపాయం కల్పిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల జెడ్‌పి సిఇఒ ఆర్. వెంకటరమణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14, 15 ఆర్థిక సంవత్సర నిధులు సంబంధించి యుసిలు జిల్లా పరిషత్ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. వస్తున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని బోర్వెల్స్ సామాగ్రికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. మండలాభివృద్ధి గురించి అధికారులతో చర్చించారు. సచివాలయాల సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ తనతో పాటు డిఎల్‌డిఒ గోపాలకృష్ణ, ఎంపిడిఒ గీతాంజలి, మండల విస్తరణాధికారి కొండపల్లి సత్యం ఉన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

పాలకొండ రూరల్ : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఎ) 2023 డైరీ, కేలండర్‌ను ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గురువారం మండల ప్రజా ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తండాడి అనిల్ కుమార్, గొల్ల ఉమామహేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు మజ్జి సోమేశ్వర రావు, ట్రెజరర్ కాయల బాలయేసు, మహిళ అధ్యక్షులు పిసిని జయమ్మ, గుడిసె అమ్మన్న, కింతలి పారయ్య, గొట్టిపల్లి సతీష్, బుడుమూరు నారాయణ రావు పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎమెల్సీ

జీతాలు ఇప్పించండి మహాప్రభో

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రామవరం పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్లుగా పనిచేస్తున్న కె.నాగభూషణం, గర్భాపు నాగరాజు, జి.సింహాచలం జీతాల్లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎంపిడిఒ వి.కృష్ణమహేష్‌రెడ్డికి విన్నవించుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగభూషణకు గత 16 నెలలుగా జీతాల్లేవని, మిగతా ఇద్దరికి పది నెలలుగా జీతాల్లేవని వారు వాపోయారు. జీతాల్లేక ఇబ్బందులు పడుతుంటే పని మాత్రం గ్రామ సర్పంచ్ చేయించుకుంటున్నారని, జీతాలు అడిగితే మాకు డబ్బులు పంచాయతీలో లేవని చెప్తున్నారని వాపోయారు. తక్షణమే స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు. దీనికి ఎంపిడిఒ స్పందిస్తూ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపిడిఒను కలిసి వారిలో సిపిఎం నాయకులు రెడ్డి లక్ష్మీనాయుడు, రెడ్డి ఈశ్వరరావు, గ్రీన్ అంబాసిడర్ల నాయకులు కె.గౌరి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

సచివాలయం సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గాదెలవలస గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టిక లో ఆలస్యం ఉన్నందున ఇక్కడి నుంచి బయోమెట్రిక్ విధానంలో ఆన్‌లైన్ లేకుండా చూడాలని, లేనిచో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై ప్రచారం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మాట్లాడుతున్న మేనేజర్ షణ్ముఖరాజు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగంపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని, తద్వారా మార్కెట్‌ను అభివృద్ధి చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎపిసిఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని బందలుప్పిలో ప్రకృతి వ్యవసాయ రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల విస్తరణ, రైతు పొలంలో ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో మార్కెటింగ్ సదుపాయాలు, మార్కెటింగ్‌లో మెలుకువుల గురించి రైతులకు వివరించారు. అలాగే రబీ సాగుపై సమీక్షించారు. ప్రకృతి ఉత్పత్తులను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

గిరిజన గ్రామాల్లో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - కురుపాం

నిరసన ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

మండలంలోని జి.సివడ, గుజ్జవాయి గిరిజన గ్రామాల్లో గురువారం టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి హాజరయ్యారు. ముందుగా గ్రామంలో వైసిపి చేస్తున్న అరాచకాలపై నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడి మూడున్నరేళ్ల అయినా పరిపాలన, అభివృద్ధి పక్కన పెట్టి నియంతలా పరిపాలిస్తున్నారని విమర్శించారు. టిడికి వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక అర్ధరాత్రి దొంగ జీవోలు తీసుకొస్తున్నారని, ఈ ప్రభుత్వానికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి మాజీ కో–ఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, నాయకులు నందివాడ కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శిరీష

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు సీతానగరం వైద్యాధికారి కె.శిరీష ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై పూర్తిగా అవగాహన ఉండాలని, వేడి వేడి ఆహారం తీసుకోవాలని అన్నారు. రక్తహీనత ఉన్న పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్న వారు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని నిత్యం ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.రేణుక, అధ్యాపకులు రామకృష్ణ, రవి ప్రసాద్, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు

108లో ప్రసవం

ప్రజాశక్తి- సీతంపేట

108లో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

మండలంలో పుతి తకావలస పంచాయతీ ఈయమానుగుడ గ్రామానికి చెందిన ఆరిక పద్మావతి పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కి సమాచారాన్ని అందించారు. దీంతో సీతంపేట 108 సిబ్బంది ఇఎమ్‌టి రాములు, పైలేట్ సింహాచలం హుటాహుటిన గ్రామానికి చేరుకుని 108వాహనంలో ఆమెను సీతంపేట ఏరియా హాస్పిటల్‌కి తరలిస్తుండగా మార్గం మధ్యలో పురిటి నొప్పులు అధికమవడంతో వాహనాన్ని పక్కనే ఆపి సిబ్బంది రాములు చాకచక్యంగా డెలివరీ చేశారు. ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఆయన తెలిపారు. తదుపరి వైద్యం కోసం దగ్గరలో వున్నా మర్రిపాడు పిహెచ్‌సికి తరలించారు. కుటుంబ సభ్యులు 108 సిబ్బంది చేసిన సేవలకు కృతజ్ఞతలు చెప్పారు.

పరామర్శకు వెళ్తూ....

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం/ కురుపాం

లలిత (ఫైల్)

తన అక్క కుమార్తెకు అనారోగ్యంగా ఉందని పరామర్శకు వెళ్తూ బైక్‌పై జారిపడి ఓ గిరిజన మహిళ మృత్యువాత పడిన సంఘటన కురుపాం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే వలసబల్లేరుకు చెందిన నుంచి పాలక లలిత (34) శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో గల తన అక్క ఇంటికి ఆమె కుమారుడితో కలిసి బైకుపై వెళ్లింది. మోటార్ సైకిల్ వెనుక చక్రానికి ఆమె చీర అంచు చుట్టుకోవడంతో వలసబల్లేరు సమీపాన జారిపడి మృతి చెందింది. లలిత భర్త కేశవరావు మూడేళ్ల క్రిందట మరణించాడు. తన తల్లి మరణించడంతో ముగ్గురు కుమారులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. నీలకంఠాపురం ఎఎస్ఐ తిరుపతిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 8మందికి గాయాలు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని వేర్వేరు చోట్ల గురువారం జరిగిన రోడ్డుప్రమాదాల్లో 8మంది విద్యార్థులు గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తలగంలో చెరకు లోడుతో సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న ట్రాక్టర్‌ను వంగర స్కూల్ నుంచి మడ్డువలసకు పిల్లలతో వస్తున్న ఆటో ఓవర్‌టాక్ చేయగా, అదే సమయానికి ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఆటోను ఢీకొంది. దీంతో ఆటో సమీప పొలంలో బోల్తాపడింది. అయితే ఆటో డ్రైవర్ కరణం గోవిందరావు చాకచక్యంగా ఉండడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న విద్యార్థులు బురడా ప్రమీల (15), బురడా అఖిల (13), కరణం ధనుంజయ (14), ధనలక్ష్మి (15) ఆటో డ్రైవర్ గోవిందరావు, అన్నం పూజిత, రెడ్డి వాసు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ట్రాక్టర్ డ్రైవర్ సంఘటనా స్థలంలో ట్రాక్టర్ విడిచిపెట్టి పరారయ్యాడు. క్షతగాత్రులను 108 ద్వారా రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులను 108లో తరలిస్తున్న సిబ్బంది

బొలెరో వాహనం ఢీకొని విద్యార్థికి గాయాలు

బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో మండలంలోని ఎం.సీతారాంపురం వసతి గృహంలో ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి పల్ల మణికంఠకు కాళ్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఎం.సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఈ ఘటన గురువారం జరిగింది. మణికంఠ నీరు తాగేందుకు రోడ్డు పక్కనే ఉన్న తాగునీటి బోరు వద్దకు రోడ్డు దాటుతుండగా బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో మణికంఠకు గాయాల య్యాయి. వెంటనే స్థానిక 108కి సమాచారం ఇవ్వగా వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి రాజాంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయంపై వార్డెన్ సూర్యం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొలెరో డ్రైవర్ పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం గళావల్లికి చెందిన టంకాల కామేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి దూసి రాములు తెలిపారు.